స్వామివారి సేవలో ప్రముఖులు

ఈఆర్‌సీ చైర్మన్ రంగారావుకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, జూలై 30 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ టి.రంగారావు, మాజీ డీజీపీ హెచ్‌జే దొర వేర్వేరుగా స్వామివారి సేవలో పాల్గొని తరించారు. మంగళవారం కొండపైకి చేరుకున్న వారికి ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. ఆలయంలోకి ప్రవేశించిన వారు స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేద ఆశీర్వచనం చేయగా.. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

స్వామివారికి సుప్రభాత సేవ

స్వామి, అమ్మవార్ల సుప్రభాత సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరు కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా సాగింది. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చించి లలితాపారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.11,95,592 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమ్మూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూలై 30 : మహిళలను ఆర్థికంగా శక్తిమంతులు చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని, మహిళా శక్తి పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా శక్తి కార్యక్రమంపై గ్రామీణాభివృద్ధి, సెర్ప్, నాబార్డ్, లీడ్ బ్యాంకు, పశు, మత్స్య, వ్యవసాయ, స్త్రీనిధి, పరిశ్రమలు, విజయ డెయిరా తదితర శాఖల అధికారులు, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్యల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ప్రణాళిక రూపకల్పన, అమలుపై కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాల సభ్యుల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం మహిళా శక్తి పథకం ప్రధాన ఉద్దేశాలన్నారు. సూక్ష్మతరహా పరిశ్రమలను గుర్తించి, అందులో సంఘాలను ప్రోత్సహించడం, ఆయా సంఘాల్లోని మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకుని, ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకులు మార్కెటింగ్‌కు సహకారం అందివ్వడం మహిళాశక్తి పథకంలో భాగమని తెలిపారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పర్మినెంట్ స్టిచింగ్ సెంటర్లు, పాడి గేదెల పెంపకం, మొబైల్ ఫిష్ అవుట్‌లెట్, పాల డెయిరీలు, మీ సేవ కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ పరికరాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ తదితర 14 రకాల జీవనోపాధులు ఇందులో భాగమని చెప్పారు. మహిళా శక్తి పథకంలో జిల్లాలో 2024- 25 సంవత్సరానికి 12,451 యూనిట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన వారికి స్త్రీనిధి బ్యాంకు రుణాలను టై అప్ చేయాలన్నారు. బ్యాంకులు కావాల్సిన డాక్యుమెంట్ల చెక్ లిస్ట్‌ను ముందుగానే గ్రూపులకు అందించి రుణ సౌకర్యాన్ని సులభతరం చేయాలని సూచించారు. ఇందు కోసం సంబంధిత శాఖలు డైరెక్ట్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసుకోవాలని, ముందుగా కొన్ని మోడల్ పైలెట్ ప్రాజెక్టులను ప్రారంభించాలని అన్నారు. తద్వారా పథకాల నిర్వహణ, మార్కెటింగ్ అంశాలపై అవగాహన, మెళకువలు తెలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.గంగాధర్, డీఆర్డీఓ ఎంఏ కృష్ణన్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, కార్యదర్శులు సంతోష, మౌనిక పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా రుణమాఫీ చెక్కు అందుకున్న శోభ

ఆత్మకూరు(ఎం) : సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న రుణమాఫీ చెక్కు విడుదలలో పాల్గొన్న మహిళా రైతు శోభ

ఆత్మకూరు(ఎం), జూలై 30 : మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు చెరుకు శోభ మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చెక్కును అందుకున్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి జిల్లా నుంచి శోభ ఎంపికయ్యారు. గతంలో బ్యాంకులో లక్షా 20వేలు లోన్ తీసుకోగా.. వడ్డీతో కలిపి రూ.లక్షా 50వేలు అయ్యిందని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా చెక్కు అందుకోవడం సంతోషకరంగా ఉన్నదని శోభ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే డయల్ యువర్ చైర్మన్

● భువనగిరి మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమంలో ప్రజలు చెబుతున్న సమస్యలను రాసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, జూలై 30 : పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మున్సిపల్ కార్యాలయంలో డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పి.రామానుజులరెడ్డితో కలిసి మంగళవారం డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు చెప్పిన సమస్యలను రాసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, కోతులు, కుక్కల బెడద నివారించాలని కోరారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు రూ.10 లక్షల విలువ చేసే తోపుడు బండ్లు, రిక్షాలు, పారలు, జబ్బలు, చీపుర్లు, కొడవళ్లు, కత్తులు, గడ్డపారలు అందజేశారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

వలిగొండ, జూలై 30 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా తీవ్రమైన అన్యాయం చేసిందని, ఆ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణతోపాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు త్రీవ అన్యాయం చేశారన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరిగినా నోరు మెదపకపోవడంపై సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ఎంపీలను డిమాండ్ చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీ తెలంగాణ ఎంపీలను ప్రజా క్షేత్రంలో నిలదీయాలని, కేంద్ర ప్రభుత్వంతో పోరాటం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందుండాలని సూచించారు. కేంద్రానికి వ్యతిరేకంగా చేసే న్యాయబద్ధమైన పోరాటానికి సీపీఎం మద్దతిస్తుందన్నారు. ప్రగతిశీల శక్తుల ఐక్యతతో బీజేపీ ప్రభుత్వం చేసే ఆగడాలను అరికడుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కుల కోసం సీపీఎం చేస్తున్న పోరాటాల్లో కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నిరుపేదలకు రేషన్ కార్డులు, ఇండ్లు, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న పేదలకు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దోనూరి నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర సెక్రటేరియట్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన

రాజాపేట : దూదివెంకటాపురంలో పత్తి పంటను పరిశీలిస్తున్న కేంద్ర సెక్రటేరియట్ బృందం సభ్యులు

యాదగిరిగుట్ట/ రాజాపేట/ తుర్కపల్లి జూలై 30 : కేంద్ర సెక్రటేరియట్ సెక్షన్ అధికారుల బృందం మంగళవారం పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టింది. శిక్షణలో భాగంగా గ్రామాల్లో సామాజిక, ఆర్థిక సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు యాదగిరిగుట్ట మండలం మల్లాపురం, రాజాపేట మండలం దూదివెంకటాపురం, తుర్కపల్లి మండలంలోని ధర్మారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేశారు. రైతులు సాగు చేసిన పంటలు, ఉపాధి హామీ పనులు, ప్రజల జీవన స్థితిగతులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండల స్థాయి అధికారులతో కలిసి సమావేశమై గ్రామాల్లో వివిధ అంశాలపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధ్యయనం చేసేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ పర్యటనలో బీహార్ సెక్రటేరియట్ అధికారి సాక్షి ప్రియ, ఉత్తరప్రదేశ్ పెట్రోలియం శాఖకు చెందిన అంకిత మౌర్య, ఢిల్లీ ఆర్థిక శాఖ అధికారి స్వీటి, హర్యానా రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారి తమన్నా, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలి

● తెలంగాణ పారంపర్య వైద్య మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాత్ర మహారుషి

బాలయోగ స్వామికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు యాత్ర మహారుషి

యాదగిరిగుట్ట, జూలై 30 : జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలని, అంతరించిపోతున్న అరుదైన వన మూలికలను కాపాడాలని తెలంగాణ పారంపర్య వైద్య మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దొంత యాత్ర మహారుషి అన్నారు. యాదగిరిగుట్టలోని పద్మశాలి నిత్యన్నదాన సత్రం భవనంలో రెండోరోజు మంగళవారం జరిగిన శిక్షణకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది గ్రామీణ ఆయుర్వేద వైద్యులు పాల్గొన్నారు. శిక్షణకు ముఖ్య అతిథులుగా శ్రీశైలానికి చెందిన ఓంసాయి బాల సిద్ధిపీఠం పీఠాధీశ్వరులు బాలయోగ స్వామీజీ, సీనియర్ ఆయుర్వేద వైద్యులు ఎస్.చంద్రశేఖర రాజు, సోమశేఖర్, బెంగుళూరుకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ హరిరామమూర్తి, తమిళనాడుకు చెందిన ఆయుర్వేద వైద్యుడు అరుముగ పాండ్యన్ హాజరయ్యారు. అనంతరం యాత్ర మహారుషి మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణలో భాగంగా సాంప్రదాయ వైద్యులు కార్యకర్తలుగా కొనసాగాలని, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలని అన్నారు. అంతరించిపోతున్న అరుదైన వనమూలికలను పరిరక్షించాలని, మొక్కల గుర్తింపు కోసం శిక్షణ చేపట్టామని తెలిపారు. బుధవారం జరిగే శిక్షణ ముగింపు సభలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, యాదగిరిగుట్ట ఆలయ ఈఓ భాస్కర్‌రావు, శివక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పారంపర్య వైద్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరూరి బాలనర్సయ్య, ఉపాధ్యక్షుడు రామంచి శ్రీనివాస్, కార్యనిర్వహణ కార్యదర్శి సింహాచలం లక్ష్మణస్వామి, ఐత రాజయ్య, కోశాధికారి తొవిటి దుర్గారాణి, భానుప్రసాద్, పండిత్ శ్రీనివాస్, భవాని, స్వామి పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

చౌటుప్పల్, జూలై 30 : చెట్టుకు ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన బొల్లమోని సంజీవ (20) మంగళవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. యువకుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పాము కాటుకు గురైన వలస కూలీ మృతి

చౌటుప్పల్, జూలై 30 : పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న వలస కూలీ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ జిల్లా మహువజారి గ్రామ పరిధిలోని యందార్ గ్రామానికి చెందిన సుజిత్ మహాలీ (43) స్థానిక నైల్ పరిశ్రమలో ఓ కాంట్రాక్టర్ కింద దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. గ్రామంలోని లక్ష్మీనర్సింహ వెంచర్‌లోని ఓ అద్దె ఇంట్లో కొంతకాలంగా నివాసముంటున్నాడు. ఈ నెల 28న అతను నిద్రిస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

బీబీనగర్, జూలై 30 : మండలంలోని రహీంఖాన్‌గూడ గ్రామ సమీపంలో ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్ పోచంపల్లికి చెందిన బడుగు నరసింహ (60) మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బీబీనగర్ నుంచి పోచంపల్లి వైపు వెళ్తుండగా రహీంఖాన్‌గూడ గ్రామ సమీపంలోని పోచమ్మ గుడి వద్ద ఎదురుగా వచ్చిన ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొట్టింది. దాంతో తీవ్ర గాయాలైన నరసింహ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రమేశ్ తెలిపారు.

ముగ్గురికి రిమాండ్

భువనగిరి కలెక్టరేట్, జూలై 30 : పలు దొంగతనాల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన రేగు మల్లేశ్, నోముల శ్రీశైలం, దయ్యాల నరేశ్ ముఠాగా ఏర్పడి జూన్ 3న రాయగిరి శివారులోని ఒక షాపులో వంద మీటర్ల కాపర్ వైర్‌ను దొంగిలించారు. చందుపట్ల గ్రామానికి చెందిన నర్సింహ ట్రాక్టర్ ట్రాలీని దొంగిలించారు. ఈ నెల 27న వీరవెల్లి గ్రామానికి చెందిన జమ్ముల భిక్షపతి వ్యవసాయ భూమిలోని రెండు మోటర్లు, 12 పైపులను అపహరించారు. చోరీ చేసిన వస్తువులను అమ్మేందుకు టాటా ఏస్ వాహనంలో మంగళవారం భువనగిరికి వెళ్తుండగా.. మోత్కూర్ చౌరస్తా వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ప్రశ్నించగా.. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరాలను ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్టు

మోటకొండూరు : పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు

బీబీనగర్, జూలై 30 : ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం నేపథ్యంలో మంగళవారం సీఐటీయూ నాయకులను, గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు గాడి శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసులు అత్యుత్సాహంతో ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సీఐటీయూ పోరాడుతుందని చెప్పారు.

భూదాన్ పోచంపల్లి : హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు, కోఠిలోని కమిషనర్ కార్యాలయానికి తరలి వెళ్తున్న గ్రామపంచాయతీ, ఆశ వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బహిరంగ సభకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, గ్రామ పంచాయతీ కార్మికులు చాంద్‌పాషా, రామచంద్రం, పోచమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండలం నుంచి అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా కార్మికులు, సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లూరు ఆంజనేయులు, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు గోసంగి పరమేశ్, కార్యదర్శి బుగ్గ శ్రీశైలం, బోగారం వీరస్వామి, మారబోయిన అశోక్, బొట్ల లక్ష్మీనరసింహ, కొల్లూరు మల్లేశ్, భిక్షపతి, దయాకర్ ఉన్నారు.

మోత్కూరు : అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ సిబ్బందిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో పంచాయతీ కార్మికులు సూరారం భాస్కర్, వేముల సుదర్శన్, జిట్ట శివరాజు, సూరారం బుచ్చయ్య, పొట్టిపాక సైదులు, జినుకల వెంకన్న, నల్ల ధనుంజయ్, లతీఫ్, మల్లయ్య ఉన్నారు.

ఆశ కార్యకర్తల అరెస్ట్

ఆత్మకూరు(ఎం), జూలై 30 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు వివిధ ప్రజా సంఘాల నాయకులను మంగళవారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఎం జిల్లా నాయకుడు రచ్చ గోవర్ధన్, గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకుడు లక్ష్మయ్య, ఎమ్మార్సీ కార్యాలయ ఉద్యోగులు వెంకటేశ్ రాజు, భాగ్యమ్మ, సరిత ఉన్నారు.

జీతాలు పెంచాలని జీపీ కార్మికుల నిరసన

తుర్కపల్లి, జూలై 30 : ఎన్నో ఏండ్లుగా గ్రామపంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని, జీతాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గంధమల్ల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో కార్మికులు సాగర్ల కిష్టయ్య, సుశీల, లక్ష్మి, కనకరాజు, యాదగిరి, నర్సింహులు పాల్గొన్నారు.

అనుమానంతో వ్యక్తిని చితకబాదిన గ్రామస్తులు

బాధితుడు సంపంగిరావు

భువనగిరి కలెక్టరేట్, జూలై 30 : మండలంలోని బస్వాపురం గ్రామంలో సోమవారం రాత్రి అనుమానంతో ఓ వ్యక్తిని గ్రామస్తులు చితకబాదారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరికల్ మండలం దన్‌వాడకు చెందిన సంపంగిరావు ఆదివారం రాత్రి బస్వాపురంలో తచ్చాడుతుండగా అనుమానం వచ్చిన గ్రామస్తులు పట్టుకుని నిలదీశారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంపంగిరావును స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించి ఎలాంటి దొంగతనాలకు పాల్పడలేదని నిర్ధారణకు వచ్చారు. సంపంగిరావు వదిలిన చెప్పులను తెచ్చుకునేందుకు సోమవారం రాత్రి మళ్లీ గ్రామానికి వెళ్లగా.. గ్రామస్తులు చితకబాదారు. దాంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అతనికి ఆసుపత్రిలో చికిత్స చేయించి పట్టణంలోని నిరాశ్రయుల ఆశ్రమ కేంద్రానికి తరలించారు. సంపంగిరావుపై ఎక్కడా ఫిర్యాదులు, కేసులు లేవని.. అనవసరంగా, అనుమానంతో అతనిపై గ్రామస్తులు దాడి చేశారని ఎస్ఐ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా గుర్తించాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

ఆలేరు రూరల్, జూలై 30 : ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా గుర్తించి ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. ఆలేరులో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 5న రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ ఆధ్వర్యంలో ఒక రోజు ఉపవాస దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీక్షకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో చౌడబోయిన కనకయ్య, నాయకులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలి

భువనగిరి కలెక్టరేట్, జూలై 30 : కామారెడ్డి ఎన్నికల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడారు. కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని, బీసీ రిజర్వేషన్లను 43శాతం పెంచాలని కోరారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందజేశారు.

కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డీఎల్ఎన్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

భువనగిరి కలెక్టరేట్, జూలై 30 : సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీరా కిషన్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. హాస్టళ్లలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్య నరేశ్, ప్రధాన కార్యదర్శి ధరావత్ రాజునాయక్, నాయకులు శంకర్‌నాయక్, అశోక్, బాల్యనాయక్, బిచ్చానాయక్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

మోటకొండూర్, జూలై 30 : మండల కేంద్రంలోని